ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
శనివారం 6 సెప్టెంబరు 2025

ఇటీవల భారీ వర్షాలకు పంట నష్టం వివరాలిలా..

జిల్లాలో జరిగిన పంట నష్టం	: 18310.15 (ఎకరాల్లో..)
పత్తి పంట	: 14225.14
సోయాబీన్	: 3155.2
కంది	: 473.65
మొక్కజొన్న	: 364.61
ఇతర పంటలు	: 91.55



ఆదిలాబాద్‌లో నిమజ్జనంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

గంగమ్మ ఒడికి గణనాథుడు

- జిల్లాలో పలుచోట్ల ప్రారంభమైన
- వినాయక నిమజ్జనం కార్యక్రమం
- జిల్లాకేంద్రంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

మరిన్ని వివరాలు 7వ పేజీలో....



ప్రధాని చిత్ర పటానికి పాలతో అభిషేకం చేస్తున్న ఎంపీ గోడం నగేష్, బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్

జీఎస్టీ తగ్గింపుతో పేదలకు మేలు : ఎంపీ

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపు రేట్లు పేదల వినియోగ వ్యయాన్ని తగ్గించడానికి సహాయపడతాయని ఎంపీ గోడం నగేష్ ఉద్ఘాటించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ జీఎస్టీ తగ్గించడంపై హర్షిస్తూ బీజేపీ మండల అధ్యక్షుడు కేంద్రే బాలాజీ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక బీజేపీ పార్టీ కార్యాలయంలో బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్‌తో కలిసి ఆయన ప్రధాని చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన న్యూఢిల్లీలో జీఎస్టీ కౌన్సిల్ సమావేశం నిర్వహించి పాల ఉత్పత్తుల నుంచి ఆటో మొబైల్స్ వరకు జీఎస్టీ రేట్లపై కీలక నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. అలాగే రోజువారీ వినియోగ వస్తువులపై పన్ను రేట్లను తగ్గించడానికి వస్తువులు, సేవల పన్ను సవరణలపై నిర్ణయం తీసుకున్నారని, తగ్గించిన జీఎస్టీతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు మేలు లభించనున్నదన్నారు. ఇందులో బీజేపీ జిల్లా కార్యనిర్వాహక సభ్యులు జైస్వాల్ శివకుమార్, బీజేపీ ఖానాపూర్ అసెంబ్లీ కో కన్వీనర్ ఆరెల్లి రాజలింగం, మాజీ ఎంపీటీసీలు, తదితరులున్నారు.

● సామాన్యులకు ఎంతగానో ఊరట

బోథ్: ప్రధానమంత్రి జీఎస్టీ తగ్గించడం వల్ల దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు ఊరట కలిగిందని భారతీయ జనతా పార్టీ మండల కన్వీనర్ బోరే రవీందర్ పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రసంగించిన ప్రధానమంత్రి ముందుగానే జీఎస్టీని తగ్గించే ఆస్కారం ఉందని పేర్కొనడం జరిగిందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. మాట ప్రకారం జీఎస్టీ తగ్గించి అన్నివర్గాలకు ఊరట కల్పించాలన్నారు.



గ్రామం గుండా ప్రవహిస్తున్న ఉమ్రి వాగు

చిత్తగూడకు వెళ్లాలంటే.. వాగు దాటాల్సిందే...

నార్నూర్ రూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం వచ్చిందంటే చాలు ఇక మండలంలోని చిత్తగూడ గ్రామానికి చెందిన ప్రజలు పడే కష్టాలు అంతాఇంత కాదు. ఎవరైనా ఆరోగ్యం, ఇతర ఏమైనా సమస్యలు వస్తే ఇతర గ్రామాలకు వెళ్లాలి అంటే ఇక ఉమ్రి వాగు డాటాల్సిందే. దీనికి సంబంధించి గ్రామస్థులు.. ప్రజాప్రతినిధులు, అధికారులకు ఈ రోడ్డు నిర్మాణం కోసం పలుమార్లు ఫిర్యాదులు చేసినా లాభం లేకుండా పోతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం ఎన్నికలు వస్తే మా గ్రామానికి ఓటు అడగటానికి నాయకులు వస్తారని మండిపడుతున్నారు. ఇప్పటికైనా రోడ్డు, బ్రిడ్జి నిర్మాణం చేస్తే గ్రామానికి రాకపోకలు సులభతర అవుతుందని గ్రామస్థులు కోరుతున్నారు.

భారీ వర్షాలు, వరదల.. దెబ్బకు అన్నదాతలు విలవిలలాడుతున్నారు. ఈ యేడు సంవృద్ధిగా కురిసిన వర్షాలతో అధిక దిగుబడులు వస్తాయని ఆశపడ్డా.. అంతలోనే పంటలను వరదలు ముంచెత్తడంతో అన్నదాతలు ఆగమాగమవుతున్నారు. జిల్లాలో అధికంగా కురుస్తున్న వర్షాలకు పంట పొలాలు జౌకుపట్టి పోయి పంటల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం పడుతుంది. లోతట్టు చేన్లలో రోజుల తరబడి నీరు నిల్వడంతో పంటలు ఎరుపుభారీ ఎదుగుదల లేకుండా పోతున్నాయి. జిల్లా సాధారణ వర్షపాతం 867.7మి.మీ.లు కాగా ఇప్పటి వరకు

● ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బోరజ్ మండలంలో నేలపాలైన పత్తి పంట



అన్నదాత.. విలవిల

- జిల్లాలో దిగుబడులు రావన్న బెంగతో ఉసురు తీసుకుంటున్న రైతులు
- ప్రభుత్వ పరిహారం కోసం తప్పని ఎదురుచూపులు
- వెంటాడుతున్న ప్రకృతి వైపరీత్యాలతో ఆందోళన
- పూర్తయిన పంట నష్టం అంచనా.. ప్రభుత్వానికి నివేదిక
- జిల్లావ్యాప్తంగా ఈ సీజన్‌లో 5.72 లక్షల ఎకరాలకు పైగా వివిధ రకాల పంటల సాగు



● జైనథ్ మండలంలో పత్తి పంటలో నిలిచిన వరద నీరు (ఫైల్)

ఆదిలాబాద్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సాగుపనులు ముందుకుసాగడం లేదు. మునుపెన్నడూ లేని విధంగా ఆగస్టులో రికార్డు స్థాయిలో వర్షాలు కురిశాయి. ఈ వానాకాలం సీజన్‌లో జిల్లావ్యాప్తంగా 5లక్షల 72వేల 384 ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేయగా ఇందులో పత్తి పంటనే అధికంగా 4లక్షల 35వేల ఎకరాలలో సాగైంది. అధిక వర్షాలతో అన్నదాతల్లో ఆందోళన వ్యక్తమవుతుంది. మొదట 22వేల 394 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం 12,338 మంది రైతులకు సంబంధించిన పంటలు జిల్లావ్యాప్తంగా 18వేల 310.15 ఎకరాలలో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు ఫైనల్ నివేదికను సిద్ధం చేశారు. ఇందులో అధికంగా 14వేల 225.14 ఎకరాలలో పత్తి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. అయితే సమృద్ధిగా కురుస్తున్న వర్షాలతో ఆనంద పడాలో లేక బాధపడాలో అర్థంకాని పరిస్థితుల్లో అన్నదాతలు ఉన్నారు. పంటలు చేతికొచ్చే సమయంలోనే ప్రకృతి కన్నెర్ర చేయడంతో కళ్ల ముందే నేలపాలు కావడంతో అన్నదాతలు కన్నీరు మున్నీరవుతున్నారు.

భారీ వర్షాలు, వరదలతో చిత్తవుతున్న పత్తి రైతులు

దిగుబడులపై బెంగ

అష్టకష్టాలు పడి పంటలను సాగు చేస్తే వర్షాలు, వరదలు ముంచెత్తడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. దీంతో పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదన్న ఆందోళన కనిపిస్తుంది. అప్పుల బాధలు, సరైన దిగుబడులు రావన్న బెంగతో అన్నదాతలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇటీవల బోరజ్ మండలం గూడ గ్రామానికి చెందిన కర్ల నారాయణ(58) అనే రైతు తనకున్న నాలుగు ఎకరాలతో పాటు మరో 10 ఎకరాలను కౌలుకు తీసుకుని పత్తి పంటను సాగు చేశాడు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట ఎదుగుదల పూర్తిగా నిలిచి పోయింది. దీంతో తీవ్ర మనోవేదనకు గురై పంట దిగుబడులు రావన్న బెంగతో పశువుల పాకలోని దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భరోసా కల్పించక పోవడంతోనే రైతులు మానసికంగా కుంగిపోతున్నారు. అలాగే పంటలను చీడపీడలు చుట్టుముట్టడంతో పెట్టుబడి ఖర్చు భారం బారీగా పెరిగి పోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణ పరిస్థితులు సహకరించక పోవడంతో సాగు పనులు ముందుకు సాగడం లేదని వాపోతున్నారు.

పత్తి రైతుల నేలచూపులు

తెల్ల బంగారంపై భారీ ఆశలు పెట్టుకుని సాగు చేసిన పత్తి రైతుల ఆశలు చిత్తవుతున్నాయి. ఇన్నాళ్లు ఏపుగా పెరిగి కనిపించిన పత్తి పంట అధిక వర్షాలతో నేలపాలవుతుంది. మరో నెల రోజుల్లోనే చేతికొచ్చే సమయంలోనే పంటలు నేలపాలు కావడం పై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పత్తి పంట పూత, కాత దశలో

(తరువాయి 6వ పేజీలో....)

మండలాల వారీగా పంట నష్ట పరిహారం వివరాలిలా..

మండలం	పంట నష్టం(ఎకరాల్లో..)
ఆదిలాబాద్ రూరల్	- 1804.12
బజార్‌హత్నూర్	- 960.42
బేల	- 1955.73
భీంపూర్	- 1113
బోరజ్	- 2283.76
బోథ్	- 471.69
గాదిగూడ	- 158.1
గుడిహత్నూర్	- 674.17
ఇచ్చోడ	- 270.3
ఇంద్రవెల్లి	- 474.92
జైనథ్	- 2383.93
మావల	- 26.16
నార్నూర్	- 108
నేరడిగొండ	- 1269.26
సాత్నాల	- 425
సిరికొండ	- 677.26
సోనాల	- 433.2
తలమడుగు	- 1089.33
తాంసి	- 527.7
ఉట్నూర్	- 1191.1

నిబంధనల ప్రకారం ఇళ్లు నిర్మించుకోవాలి

● జిల్లా కలెక్టర్ రాజర్షి షా ● ఇంద్రవెల్లిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ ● పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే



మంజూరు పత్రాల పంపిణీ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్‌లు



హాజరైన ఆదివాసీ కొలాం గిరిజనులు

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్దేశించిన ఇళ్ల నమూనా మేరకు లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకోవాలని కలెక్టర్ రాజర్షి షా లబ్ధిదారులకు సూచించారు. మండల కేంద్రంలోని స్థానిక మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఇంద్రవెల్లి, సిరికొండ మండలానికి చెందిన పీవీటీజీ 402 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో జిల్లాలోని వెనుకబడిన పీవీటీజీ లబ్ధిదారులకు నూటికి నూరు శాతం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. లబ్ధిదారులు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొనాల్సిన పరిస్థితుల్లో స్వయం సహాయ సంఘాల (ఎస్‌హెచ్‌జీ) ద్వారా బ్యాంకు రుణాలు తీసుకుని ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. ప్రతీ మండలానికి ప్రత్యేకంగా ఇందిరమ్మఇళ్ల కోసం ఒక అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ)ను నియమించామని, వారు పర్యవేక్షణతో పాటు సాంకేతిక సహాయాన్ని అందిస్తారని తెలిపారు. ఇందుకు సంబంధించి అధికారులకు తగిన ఆదేశాలు ఇప్పటికే జారీ చేశామని తెలిపారు.

● పీఎం-జన్‌మన్‌తో ఆదివాసీల అభివృద్ధి

ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం-జన్‌మన్) కార్యక్రమం కింద కేంద్ర ప్రభుత్వం ఆదివాసీ(పీవీటీజీ) గ్రామాలకు మౌలిక వసతులు కల్పించి సంపూర్ణ అభివృద్ధికి కృషిచేస్తున్నదని ఎంపీ గోడం నగేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీవీటీజీ గ్రామాల్లో ప్రతి కుటుంబానికి ఉచితంగా వంట గ్యాస్ కనెక్షన్, విద్యుత్తు, తాగునీటి సదుపాయాలు కల్పిస్తామని, ఆయుష్మాన్ భారత్ కార్డులు అందజేస్తామని తెలిపారు. పీఎం జన్‌మన్ కార్యక్రమం కింద ప్రతి పీవీటీజీ కుటుంబానికి పక్కా ఇల్లు, ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు మంజూరు, పీవీటీజీల జీవనోపాధిని మెరుగుపర్చేందుకు ఐటీడీఏ ప్రత్యేకంగా కృషి చేస్తుంద ఎంపీ పేర్కొన్నారు.

● అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అర్హులైన ప్రతీ లబ్ధిదారునికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. నియోజకవర్గంలో అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. ఇందులో ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మార్మాట్, మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఇంచార్జీ ఎంపీడీవో జీవన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● స్వచ్ఛంద రక్తదానం అభినందనీయం

ఆదిలాబాద్ టౌన్: మిలాద్-ఉన్-నబీ పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక రక్తదాన శిబిరం విజయవంతంగా సాగింది. స్థానిక ఉర్దూ ఘర్ షాదీఖానాలో శిబిరాన్ని నిర్వహించగా.. కలెక్టర్ రాజర్షి షా ముఖ్య అతిథిగా హాజరై రక్తదానం చేసిన వారికి అభినందనలు తెలియజేశారు. ముందుగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా కలెక్టర్ ఆవరణలో మొక్క నాటారు. కార్యక్రమానికి అర్బాత్ అహ్మద్ ఖాన్ కన్వీనర్‌గా, ఆమేర్ పటేల్ కోకన్వీనర్‌గా వ్యవహరించారు. ఇందులో డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, మైనారిటీల సంక్షేమ అధికారి కలీం హాజరయ్యారు.

ఇళ్లను నాణ్యతగా నిర్మించుకోవాలి

● దెబ్బతిన్న రోడ్లు, పంటలు పరిశీలించిన ఎమ్మెల్యే బొజ్జు

ఉట్నూర్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను నాణ్యతగా నిర్మించుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని దంతన్‌పల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖానాపూర్ నియోజక వర్గానికి ఇందిరమ్మ ఇళ్లు అదనంగా మంజూరు చేయించామని, గిరిజనుల కోసం ప్రత్యేక ఇళ్లు నిర్మిస్తున్నామని అన్నారు. పీవీటీజీ గిరిజనులకు సైతం ప్రత్యేకంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. లబ్ధిదారు లు ఇందిరమ్మ ఇళ్లను నాణ్యతగా నిర్మించుకునేలా చూసుకోవాలన్నారు. ఇదిలా ఉండగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పలుచోట్ల దెబ్బతిన్న రోడ్లను కూడా ఎమ్మెల్యే పరిశీలించారు. మారుమూల గ్రామాలకు ఉన్న వాగులను పరిశీలిస్తూ ఐరన్ బ్రిడ్జిలు నిర్మించేలా ప్రణాళికలు చేస్తామన్నారు. ఆయన వెంట డీసీసీబీ డైరెక్టర్ సామ ప్రభాకర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎక్బాల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు దాసండ్ల ప్రభాకర్, సిలువరు లింగన్న, ముబీన్, నందం, తదితరులు పాల్గొన్నారు.



వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

గిరిజన గ్రామాల రోడ్లకు మహర్దశ

● ఆదిలాబాద్ నియోజకవర్గానికి రూ.13.12 కోట్ల నిధుల మంజూరు : కంది శ్రీనివాస్ రెడ్డి



ఆదిలాబాద్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ నియోజకవర్గంలోని మారుమూల గిరిజన గ్రామాల రోడ్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులను మంజూరు చేసింది. నియోజకవర్గంలో చేపట్టే రోడ్డు నిర్మాణ పనులకు రూ.13కోట్ల 12లక్షల నిధులు మంజూరైనట్లు కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ నిధులతో గిరిజన గ్రామాలలో బీటీ రోడ్ల నిర్మాణాన్ని చేపడుతామన్నారు. ఆదిలాబాద్ రూరల్ శివఘాట్ నుంచి కుంభఝరి మీదుగా టాక్లి వరకు 3 కి.మీల బీటీ పనులకు గాను రూ.2కోట్ల 38లక్షలు, అల్లికోరి ఎక్స్‌రోడ్డు నుంచి అల్లికోరి గ్రామం మీదుగా కొట్టంలొద్ది వరకు 3 కి.మీ.ల బీటీ పనులకు రూ.2కోట్ల 87లక్షలు, బేల మండలం సాంగ్వి నుంచి పాటాగూడ వరకు రూ.కోటి, ఖండాల ఎక్స్‌రోడ్డు నుంచి చిమ్ధరి ఖానాపూర్ వరకు 0.20కి.మీ.లు రూ.75లక్షలు, చించుఘాట్ నుంచి చిన్న పెందూరులొద్ది మీదుగా తోషం వరకు 6.70కి.మీ.లకు గాను రూ.5కోట్లు లోహార నుంచి అర్జున గూడ సాలాయిగూడ, చిల్లతూడ, శివగూడ మీదుగా తిప్ప ఎక్స్‌రోడ్డు వరకు 0.50కి.మీ.లకు రూ.85లక్షలు, అంకోలి ఎక్స్‌రోడ్డు నుంచి దండారిగూడ స్పాన్‌బ్రిడ్జి చెక్‌డ్యాం వరకు రూ.17లక్షలు నిధులు కేటాయించినట్లు కందిశ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. నియోజక వర్గంలోని మారుమూల గిరిజన గ్రామాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిధులు మంజూరు చేయడం ఎంతో అభినందనీయమన్నారు.

వినాయక నిమజ్జనానికి సర్వం సిద్ధం

● ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం ● పటిష్ట బందోబస్తు నడుమ సాగనున్న ఉత్సవాలు



సీసీ కెమెరాలను బిగిస్తున్న సిబ్బంది

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జన వేడుకలను ఘనంగా జరిపేందుకు భక్తజనం సిద్ధమైంది. పది రోజుల పాటు భక్తి శ్రద్ధాలతో గణ నాథుడిని కొలిచిన భక్తులు.. వినాయకుడికి ఘనమైన వీడ్కోలు పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అటు జిల్లా అధికార యంత్రాంగం సైతం ఉత్సవాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లలో నిమగ్నమైంది. విగ్రహాల తరలింపులో ఇబ్బంది తలెత్తకుండా రోడ్లకు మరమ్మతులు చేపట్టారు. పెన్ గంగ, చాంద నదుల్లో విగ్రహాల నిమజ్జనం జరగనున్న నేపథ్యంలో అందుకు అవసరమైన క్రేన్‌లను అందుబాటులో ఉంచారు. గజ ఈతగాళ్లు, ప్రత్యేక బృందాలను అందుబాటులో ఉంచి.. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అవసరమైన పూర్తి చర్యలు తీసుకుంటున్నారు. శుక్రవారం పెన్ గంగ నది వద్ద పరిసరాలను కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్ పరిశీలించారు. అనంతరం అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

600 మంది సిబ్బందితో బందోబస్తు

పట్టణంలో 600 మంది పోలీసు సిబ్బందితో నిమర్జనోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. తెలిపారు. ప్రత్యేకంగా 350 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి 24 గంటలు కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. పట్టణంలో 8 క్లస్టర్‌లు విభజించి సిబ్బందిని అడుగడుగునా ఏర్పాటు చేశామని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రశాంత వాతావరణంలో గణపతి ఉత్సవాలను పూర్తి చేసుకొని నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. పట్టణంలో ముఖ్యమైన ప్రదేశాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో 23 పికెట్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రత్యేకంగా సీఐ స్థాయి అధికారిని ఏర్పాటు చేసి రెండు స్ట్రైకింగ్ ఫోర్సులను ఏర్పాటు చేసి 15 మంది పోలీసు సిబ్బందిని అందుబాటులో ఉంచారు. పట్టణంలో ఉన్న ప్రతీఒక్క దారిలో సెక్టర్ సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తూ అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పర్యవేక్షిస్తారన్నారు. ప్రధానమైన రోడ్లలో రూఫ్ టాప్ బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారని, పట్టణంలో 15 మంది కెమెరా సిబ్బందిని ఏర్పాటు చేసి సమస్యల సృష్టించే వారిని వీడియోగ్రఫీ ద్వారా గర్తించడం జరుగుతుందన్నారు. డ్రోన్ కెమెరాతో పట్టణంలోని పరిస్థితిని పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. ప్రత్యేకంగా రెండు బృందాల సిబ్బందిని మఫ్టీలో ఉంచి ఆకతాయిలు, ప్రజలను రెచ్చగొట్టే వారిపై నిఘా ఏర్పాటు చేశామన్నారు.



పెన్‌గంగ వద్ద పరిస్థితిని సమీక్షిస్తున్న అధికారులు

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

● జిల్లాలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం వివరాలు 7లో...


పాలాజ్ గణేషుని సన్నిధిలో నిర్మల్, ముథోల్ ఎమ్మెల్యేలు

పాలాజ్ గణేషుణ్ని దర్శించుకున్న ఎమ్మెల్యేలు

కుభీర్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలానికి సరిహద్దులో గల ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పాలాజ్ కర్ర వినాయకున్ని శుక్రవారం ముధోల్ నియోజక వర్గ ఎమ్మెల్యే పవార్ రామరావుపాటిల్, నిర్మల్ నియోజక వర్గ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డిలు దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న వారు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించిగా అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. వీరి వెంట మండల బీజేపీ నాయకులున్నారు.

డాక్టర్ శివకృష్ణకు ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): బోధన, అభ్యాసం, పరిపాలనలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన బోథ్ తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివకృష్ణ ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డుకు ఎంపికయ్యారు. టీచర్స్ డేను పురస్కరించుకొని శుక్రవారం హైదరాబాద్ లోని శిల్పకళావేదికలో ఏర్పాటు చేసిన గురుపూజోత్సవ్ కార్యక్రమంలో విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, డైరెక్టర్ నవీన్ నికోలస్ చేతులమీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శివకృష్ణ మాట్లాడుతూ.. ఉత్తమ ప్రిన్సిపల్‌గా ఎంపిక చేసిన టీజీటీడబ్ల్యూఆర్ఈఐ అడిషనల్ సెక్రెటరీకి కృతజ్ఞతలు తెలియజేశారు. కళాశాల అధ్యాపకుల సమష్టి కృషి, అంకితభావంతో ఇది సాధ్యమైందని తెలిపారు. విద్యారంగంలో కేవలం జ్ఞానాన్ని మాత్రమే అందించడం కాకుండా విద్యార్థుల జీవితాలను సమాజానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దడం మనందరి బాధ్యత అన్నారు. కళాశాల అనేది ఒక కుటుంబం లాంటిదని, ఇక్కడ ప్రతీ విద్యార్థి, అధ్యాపకులు, సిబ్బంది లక్ష్యాలను సాధించడంలో కీలకపాత్ర పోషిస్తారన్నారు. ఈ అవార్డు స్ఫూర్తితో మరెన్నో విజయాలు సాధించి విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందిద్దామని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ ప్రగతి, సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేపట్టాలి : మాజీ ఎమ్మెల్యే

భైంసా, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): డిజిటల్ వేదికగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమం, సంస్కరణలపై విస్తృత ప్రచారం చేపట్టి పార్టీ బలోపేతానికి పకడ్బందీగా వ్యవహరించాలని నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ప్రతినిధులకు ముథోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ పిలుపునిచ్చారు. శుక్రవారం భైంసాలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలో నూతనంగా నియమితులైన పార్టీ సోషల్ మీడియా ప్రతినిధులకు నియామకపు పత్రాలు అందచేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.నేటి రోజుల్లో సోషల్ మీడియానే అన్ని రంగాల్లో రాజ్యమేలుతోందన్నారు. ఇందుకు అనుగుణంగానే పార్టీ సోషల్ మీడియా ప్రతినిధులు ప్రణాళికాబద్ధమైన చర్యల ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వ కార్యక్రమాలను డిజిటల్ వేదికగా ప్రజలకు చేరవేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చేపట్టిన సంస్కరణలు, సాధించిన విజయాలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియా ద్వారా ప్రజల చెంతకు తీసుకెళ్లాలని మార్గనిర్దేశం చేసారు. సామాజిక మధ్యమాల్లో చురుకుగా వ్యవహరిస్తూ పార్టీ అప్పచెప్పిన బాధ్యతలను సమర్థవంతగా చేపట్టాలని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ,బీఆర్ఎస్ పార్టీలు చేపడుతున్న దుష్ప్రచారాన్ని దీటుగా తిప్పికొట్టాలని వివరించారు. ఈ సందర్భంగా ముథోల్ నియోజక వర్గ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా నియమితులైన సీహెచ్ సాహేబ్‌రావ్‌తో పాటు ఏడు మండలాల కోఆర్డినేటర్లు, కో కోఆర్డినేటర్ల ముథోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ నియామకపు పత్రాలను అందచేశారు. ఇందులో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సమర సింహారెడ్డి, ముథోల్ నియోజకవర్గ అధ్యక్షుడు మహ్మద్ షఫీ , బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శంకర్ చంద్రే, బెజ్జంకి ముత్యం రెడ్డి, ముథోల్ మండల పార్టీ అధ్యక్షుడు గంగారెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

కొరడి గణపతిని దర్శించుకున్న నాయకులు

భైంసా రూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాటేగాం గ్రామంలోని కొరడి గణపతిని భారతీయ జనతా పార్టీ నాయకుడు నిర్మల్ ఉమ్మడి మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు వి.సత్యనారాయణ గౌడ్ శుక్రవారం దర్శించుకున్నారు. పూజారులు హారతి ఇచ్చారు. గణపతి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, పాటి పంటలు సమృద్ధిగా పండి భోగభాగ్యాలు సిద్ధించాలని గణపతిని కోరుకున్నారు. గణపతి ఆలయ అభివృద్ధికి 25 వేల రూపాయలు విరాళంగా అందజేశారు. ఆయన వెంట బీజేపీ నాయకుడు రమేష్ రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మణ రావు పటేల్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

● పల్సి కర్ర గణేష్‌ను దర్శించుకున్న అల్లోల

కుభీర్: మండలంలోని పల్సి గ్రామంలో కొలువయిన కర్ర గణేష్‌ను శుక్రవారం నిర్మల్ మాజీ ఎమ్మెల్యే ఇంద్రకరణ్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపి మొక్కులు తీర్చుకున్నారు. ఆయన వెంట గురుస్వామి శనిగరపు చిన్నయ్య, తదితరులున్నారు. ఈ సందర్భంగా ఆయనను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు.

పలుచోట్ల వినాయక నిమజ్జనం

దస్తురాబాద్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం వినాయక నిమజ్జన కార్యక్రమాలు శోభాయమానంగా జరిగాయి. పది రోజుల పాటు భక్తులు పూజించిన గణేశుడిని నిమజ్జనం కోసం ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా శక్తిశ్రద్ధలతో, డప్పులు, డీజేలతో ఊరేగింపులు సందడిగా సాగాయి. చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రత్యేక ఆకర్షణగా అలంకరించిన గణేశ్ విగ్రహాలు భక్తులను ఆకట్టుకున్నాయి. రోడ్లంతా ,గణపతి బప్పా మోర్యా నినాదాలతో మార్మోగాయి. పోలీసులు భద్రత ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ సౌకర్యార్థం ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. వివిధ చెరువులు, నదులు, కుంటల్లో విగ్రహాలను భక్తులు నిమజ్జనం చేశారు.

నిర్మల్ రూరల్: పట్టణంలోని ఆల్ఫోర్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన వినాయకుడిని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థులు శోభాయాత్రలో భజన గీతాలు ఆలపించారు.

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాలలో శుక్రవారం వేడుకగా వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గత పది రోజులుగా యువ జన సంఘాలు, గ్రామాభివృద్ధి కమిటీ, యూత్ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద ప్రతిరోజు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి ఆఖరి రోజు ప్రత్యేక వాహనంలో వినాయక విగ్రహాన్ని ఉంచి బాజా భజంత్రిలతో గ్రామ ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా తీసుకవెళ్లి సమీప చెరువుల్లో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. నిమజ్జనానికి ముందు ఆయా గ్రామాల్లో మహిళలు వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంటలు బాగా పండాలని, తమ కుటుంబ సభ్యులందరూ పిల్లా పాపలతో ఆయురారోగ్యాలతో విరజిల్లాలని వినాయకుని వేడుకున్నారు.

వినాయకుడికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వినాయక చవితి పురస్కరించుకొని సార్వజనిక వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద వినాయక నిమజ్జనం సందర్భంగా శుక్రవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ దేవుడి పట్ల విశ్వాసం కలిగి, తోటివారికి తమవంతు సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ డోంగ్రే మారుతి పటేల్, వ్యాపారస్తులు చింతావార్ సంతోష్, ముస్లే కేశవ్ పటేల్, సామాజిక కార్యకర్త రాథోడ్ అనిల్, తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే లక్ష్యంగా ఇళ్లు

● ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా నిరుపేదల అభ్యున్నతే లక్ష్యంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేదలకు ఇళ్లను నిర్మించి ఇస్తున్నారని ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పీవీటీజీలకు ప్రధాన మంత్రి జన్మన్, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను జిల్లా కలెక్టర్ రాజర్షిషాతో కలిసి పంపిణీ చేశారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలో 459 మంది ఉండగా 359 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా వారికి పత్రాలు అందించి పనులు త్వరగా చేపట్టాలని సూచించారు. పత్రాలు పంపిణీ చేసే సమయంలో సీఎంతో పాటు ప్రధాన మంత్రి


లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందిస్తున్న ఎంపీ నగేష్

ఫొటోను ముద్రించాలని, ఇండ్ల నిర్మాణంలో సగం డబ్బులు కేంద్రం ఇస్తుందని ఎంపీ నగేష్ అధికారులకు సూచించారు. మరోసారి ఇలాంటి తప్పిదాలు జరగకుండా చూడాలన్నారు. ఇండ్లులేని వారికి సొంతింటి కలను సకారం చేసేల ప్రధాన మంత్రి అవాస్ యోజన పథకాన్ని తీసుకువచ్చారన్నారు. ఆ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం కూడా సహకరిస్తు ఇందిరమ్మ ఇళ్ల పేరిట సగం డబ్బులు రాష్ట్రం, మరో సగం డబ్బులు కేంద్రం ఇస్తుందన్నారు. మొత్తం ఐదు రూ.లక్షల ఇంటి నిర్మాణానికి అందిస్తున్నామన్నారు. అదేవిధంగా ఆదివాసుల్లో అత్యంత వెనకబడిన పీవీటీజీలను మరింత అభివృద్ధి చేసేల ప్రధాన మంత్రి జన మన పథకాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. ఇండ్లతో పాటు రోడ్లు, విద్య, వైద్యం, ఇతర సౌకర్యాలు, సదుపాయలను ఈ పథకం కింద అందిస్తామన్నారు. ఇంటి నిర్మాణాల కోసం మధ్య దళారులకు డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ... జన్మన్ ఇందిరమ్మ ఇండ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పీవీటీజీలకు అందిస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో కొన్ని నిబంధనలు ఇతరులకు ఉన్నాయన్నారు. కానీ పీవీటీజీలకు ఎంతో వెసులుబాటు కల్పించడం జరిగిందన్నారు. ఆర్థిక స్థోమత లేని వారికి రుణాలను అందిస్తున్నామని తెలిపారు. కుటుంబంలోని మహిళ డ్వాక్ర గ్రూప్ సభ్యురాలుంటే ఐకేపీ నుంచి రుణాలను వస్తాయన్నారు. మంజూరు పత్రాలు పొందిన వారు పంచాయతీ కార్యదర్శిని కలిసి స్థలం చూపిస్తే అధికారులు వచ్చి మార్క్ అవుట్ ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ, డీసీసీబీ చైర్మెన్‌లు మల్లేపూల నర్సయ్య, అడ్డి భోజారెడ్డి, జడ్పీ సీఈఓ జితేంద్రరెడ్డి, పరిశ్రమల శాఖ జీఎం పద్మభూషన్ రాజు, ఆదిలాబాద్ ఎంపీడీఓ స్వప్నశీల, కొలాం సంఘం నాయకులు కోడప సోనేరావు పాల్గొన్నారు.

కైలాస్‌టేకిడి ఆలయం వద్ద ఎమ్మెల్యే పూజలు

బోథ్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల ప్రాంతంలో మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న కైలాస్ టేకిరి ఆలయాన్ని శుక్రవారం శాసనసభ్యులు జాదవ్ అనిల్ సందర్శించి ప్రత్యేక పూజలు చేయడం జరిగింది. అంతేగాక కంటే గమ్ బాబేర తాండ గ్రామలలోని గణనాథులను సందర్శించి ప్రత్యేక పూజలు చేయడం జరిగింది. ఆయన వెంట మాజీ జడ్పీటిసి సంధ్యారాణి, సర్పంచ్ల సంఘం మాజీ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, నాయకులు ఎలుక రాజు, నేరడిగొండ మాజీ ఎంపీపీ సజన్లాల్ రామ్, ప్రవీణ్, దేవేందర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

నేరడిగొండ: మండలంలోని తేజపూర్ గ్రామస్థుల ఆహ్వానం మేరకు గ్రామంలో గల రెడ్డి యూత్ ఫ్రెండ్స్ యూత్ గణేష్ మండపాలను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు భజన కీర్తనలతో ఘనంగా స్వాగతం పలికారు. మాజీ ఎంపీపీ


తేజపూర్‌లో నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే అనిల్

రాథోడ్ సజన్, శివారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, మహేందర్ రెడ్డి, శోభన్ రెడ్డి, నల్ల లక్ష్మణ్, పద్నాభ రెడ్డి, అజయ్ రెడ్డి, జితేందర్ రెడ్డి, ప్రదీప్, రాజకీరన్ రెడ్డి, పోతారెడ్డి, ఉద్యాసాగర్ రెడ్డి, నిఖిల్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

● ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం

నేరడిగొండ: మండలంలోని సేవదాస్ నగర్ గ్రామానికి వంతెన లేక వాగు దాటడం కష్టమవ్వడంతో ఈ విషయాన్ని బోథ్ ఎమ్మెల్యే


క్షీరాషేకం చేస్తున్న సేవదాస్‌నగర్ గ్రామస్తులు

అనిల్ జాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మాట ఇచ్చిన ఎమ్మెల్యే ప్రస్తుతం హై లెవల్ బ్రిడ్జిని మంజూరు చేయించినందుకు గాను శుక్రవారం ఆయన చిత్రపటానికి గ్రామస్థులు స్థానిక వాగులో క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా తమను ఎవరూ పట్టించుకోలేదని, నేడు బ్రిడ్జి నిర్మాణం పట్ల ఎమ్మెల్యేకు సదా రుణపడి ఉంటామని ముక్తకంఠంతో నినాదించారు. ఈ సందర్భంగా వారికి గ్రామస్థులు ధన్యవాదాలు తెలిపారు.

ఆధ్యాత్మిక భావం ఉట్టిపడేలా వేడుకలు

● కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు

మావల, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జన ఊరేగింపులో ప్రతీఒక్కరు భక్తి శ్రద్ధలతో ఆధ్యాత్మిక భావం ఉట్టిపడేలా వేడుకలు జరుపుకోవాలని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. గణేష్ నవరాత్రులను పురస్కరించుకుని శుక్రవారం


చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

జిల్లా కేంద్రంలోని రైతు బజార్‌లో రైతులు, డ్వాక్రా మహిళల ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుడిని దర్శించుకుని పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతుల పక్షాన నిలబడే రైతుల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్న రైతుబిడ్డగా శ్రీకాంత్ రెడ్డిని రైతులు, డ్వాక్రా మహిళలు ఘనంగా శాలువాతో సన్మానించారు. అనంతరం పట్టణంలోని రామ్ నగర్, కెఆర్కె కాలనీ, కైలాష్ నగర్, దుర్గా నగర్ కాలనీల్లో ప్రతిష్ఠించిన పలు గణేష్ మండపాలను దర్శించుకుని గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అటు తన స్వగ్రామమైన మావల లో ప్రతిష్ఠించిన గణేష్ మండపాల్లో పూజాది కార్యక్రమాల్లో పాల్గొని, ఈ మేరకు నిర్వహించిన సాంస్కృతిక పోటీల్లో గెలుపొందిన వారికీ బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా తీరొక్క వంటకాలతో నిర్వహించిన ప్రసాదం పోటీల్లో గెలుపొందిన వారిని సైతం ప్రత్యేకంగా అభినందించి మాట్లాడారు. ప్రజలంతా ఐక్యంగా ఉండాలనే సదుద్దేశంతో ప్రారంభించిన గణేష్ నవ రాత్రి ఉత్సవాలు అటు భక్తిభావంతో పాటు సోదర భావాన్ని పెంపొందిస్తాయన్నారు. సర్వ విఘ్నలను హరించే ఆ లంబోదరుడి కరుణా కటాక్షాలు ప్రజలందరిపై ఉండి, సుఖ సంతోషాలతో, పంటలు బాగా పండి ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని కోరుతున్నట్లు తెలిపారు. ఇందులో మాజీ వైస్ ఎంపీపీ గోవర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ జిల్లాలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకాలు

● దేశ ప్రజలకు దీపావళి కానుక జీఎస్టీ సంస్కరణలు : బీజేపీ

నిర్మల్‌రూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): దేశ ప్రజలకు దీపావళి కానుక జీఎస్టీ సంస్కరణ అని జిల్లా బీజేపీ నాయకులు అన్నారు. శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీ చారిత్రాత్మక నిర్ణయం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోనే నెంబర్ వన్‌గా రూపాంతరం చోటుచేసుకుందని ప్రధాన మంత్రి మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసినట్లు జిల్లా నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య మాట్లాడుతూ... ప్రజలకు జీఎస్టీ సంస్కరణ దేశ ప్రజలకు రాష్ట్ర ప్రజలకు పెద్ద ఉపశమనం దినసరి అవసరాలైన హెయిర్ ఆయిల్, షాంపై, టూత్‌పేస్ట్, బటర్, గీ, నాప్కిన్, పాత్రలు, బేబీ డైపర్స్ మొదలైన వాటిపై జీఎస్టీ 18 శాతం, 12 శాతం నుంచి కేవలం 5 శాతానికి తగ్గింపు జరుగుతుందని తెలిపారు. రైతులకు వ్యవసాయానికి బలం అని జీఎస్టీ తగ్గింపు వల్ల ట్రాక్టర్లు, ట్రాక్టర్ టైర్లు, డ్రిప్ ఇరిగేషన్ సిస్టమ్స్, బయో-పెస్టిసైడ్స్, వ్యవసాయ యంత్రాలపై పన్నులు భారీగా తగ్గింపు జరగనుందని తెలిపారు. జిల్లా మాజీ అధ్యక్షులు అంజు కుమార్ రెడ్డి మాట్లాడుతూ... ఆరోగ్య రంగంలో జీఎస్టీ తగ్గింపు వల్ల దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు జరగనుందని, ఆరోగ్య బీమా, మెడికల్ ఆక్సిజన్, డయాగ్నొస్టిక్ కిట్స్, గ్లూకోమీటర్స్ వంటి వాటిపై పూర్తిగా రద్దు లేదా భారీ తగ్గింపు జరగనుందని అలాగే విద్యా రంగంలో మ్యాప్స్, గ్లోబ్స్, పెన్సిల్స్, నోట్ బుక్స్ వంటి వాటిపై జీఎస్టీ పూర్తిగా రద్దు కానుందని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... జీఎస్టీ తగ్గింపు వల్ల మధ్యతరగతి కుటుంబాలకు ఊరట కలుగనుందని, టీవీలు, ఏసీలు, మానిటర్లు, డిష్ వాషింగ్ మెషీన్స్ వంటి ఎలక్ట్రానిక్ వస్తువులపై 28 శాతం నుంచి 18 శాతంకు తగ్గింపు అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆడెపు సుధాకర్, అసెంబ్లీ కన్వీనర్ గాదే విలాస్, జిల్లా ఉపాధ్యక్షులు కమల్ నయన్, నాయకులు వెంటాపూరం నారాయణ రెడ్డి, స్టేట్ కౌన్సిల్ మెంబర్ దరశథ్ పోశెట్టి, అయ్యన్నగారి రాజేందర్, నాయకులు రచ్చ మల్లేష్, లింబాద్రి, గుర్రం నర్సయ్య, మూడారపు దిలీప్, పంతికే ప్రకాష్


ఖానాపూర్‌లో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు


నిర్మల్‌లో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ శ్రేణులు

పాల్గొన్నారు.

ఖానాపూర్: ఇటీవల జీఎస్టీ పన్నులను తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం నిరుపేదలకు వరం లాంటిదని బీజేపీ ఖానాపూర్ మండల శాఖ అభిప్రాయం వ్యక్తం చేసింది. జీఎస్టీ పన్నుల భారాన్ని తగ్గించడం పట్ల శుక్రవారం బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఫోటోతో కూడిన ప్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ... 28 శాతం ఉన్న జీఎస్టీ పన్నులను 18 శాతానికి, 12 శాతం ఉన్న జీఎస్టీ పన్నులను ఐదు శాతానికి తగ్గించి కేంద్ర ప్రభుత్వం సామాన్యలకు ఎంతో మేలు చేసిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు పుప్పాల ఉపేందర్, పట్టణ అధ్యక్షులు కీర్తి మనోజ్, జిల్లా నాయకులు నల్ల రవీందర్ రెడ్డి, నాయిని సంతోష్, మదిరే శ్రీనివాస్, చిలుకూరి తిరుమల గిరి, ఇనుముల స్వామి, పొల్సాని అనిల్ రావు, ఎనగందుల నారాయణ, రాపెల్లి రవీందర్, మండల నాయకులు కొండవేణి రమేష్, పుప్పాల పవన్, కాలేరి రాజేందర్, తదితరులున్నారు.

సారంగాపూర్: మండల కేంద్రంలో గల బస్టాండ్ సమీపంలో శుక్రవారం దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోడి చిత్రపటానికి బీజేపీ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా మండల బీజేపీ నాయకులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ పార్టీ నాయకులు చంద్రప్రకాష్ గౌడ్, శ్రావణ్‌కుమార్, వీరయ్య, సాగర్‌రెడ్డి, రాథోడ్ నారాయణ, ఎల్లన్న, పోతన్న గణపతి, చిన్నయ్య, నర్సింగ్‌రావు, భీమలింగం, దయాకర్‌రెడ్డిలతో పాటు నాయకులు , కార్యకర్తలున్నారు.

సోన్: భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేద, మధ్య తరగతి ప్రజల అభ్యున్నతి లక్ష్యంగా జీఎస్టీని సులభతరం చేస్తూ, తీసుకున్న నిర్ణయంపై బీజేఎల్పీ నాయకులు, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి సూచనల మేరకు నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు శుక్రవారం సోన్ మండల కేంద్రంలో బీజేపీ పార్టీ మండల పార్టీ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మార గంగారెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ ముత్కపల్లి నరేష్, ప్రధాన కార్యదర్శి మామిడాల సంతోష్, సుంచు నవీన్, ఉపాధ్యక్షుడు గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.


భారీ వర్షాలకు బోరజ్ మండలంలో నేలపాలైన పత్తి పంట

అన్నదాత.. విలవిల

(5వ పేజీ తరువాయి...)

కనిపిస్తుంది. అధిక వర్షాలతో పత్తి కాయలు నల్లబారి పోయి నేలరాలుతున్నాయి. దీంతో దిగుబడులపై తీవ్ర ప్రభావం పడుతుందని అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎన్ని రకాల ప్రయత్నం చేసినా.. పంట చేతికి రావడం కష్టమేనని చెబుతున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నల్లరేగడి నేలల్లో అధిక తేమ కారణంగా పంట తీవ్రంగా దెబ్బతింటుంది. ఇన్నాళ్లు పంట దిగుబడులపై ఎన్నో ఆశలు పెట్టుకున్నా.. అంచనాలు తారుమారవుతున్నాయని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పరిహారం ఎప్పుడిస్తారో?

తీవ్రంగా నష్టపోయిన పంటలకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలంటూ గత కొద్దిరోజులుగా డిమాండ్లు వినిపిస్తున్నాయి. గతేడు వేల ఎకరాలలో పంట నష్టం జరుగగా.. కొంత మంది రైతులకు మాత్రమే ఎకరాన రూ.10 వేల చొప్పున పరిహారం చెల్లించాలంటూ రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం చెల్లించే పరిహారం ఏమూలన సరిపోదంటున్నారు. ఈసారి ఎకరాన రూ.25 వేల నష్టపరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఫసల్ బీమా సౌకర్యం లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. బీమా సౌకర్యం ఉండి ఉంటే ఎకరాన రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు పరిహారం దక్కేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం త్వరగా నష్టపరిహారాన్ని అందించాలంటున్నారు. అలాగే సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు,బ్యాంకు రుణాలను అందించి ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

పంట నష్టంపై త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక
: శివకుమార్, ఏడీఏ, ఆదిలాబాద్

జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు వరదల కారణంగా దెబ్బతిన్న పంటల వివరాలను సేకరించడం జరిగింది. జిల్లావ్యాప్తంగా 18310.15 ఎకరాలలో పంట నష్టం జరిగినట్లు గుర్తించాం. గ్రామాల వారీగా క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించడం జరిగింది. నష్టపోయిన రైతులందరికి పంట నష్ట పరిహారం అందేవిధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఎకరాన ఎంత నష్టపరిహారం ఇచ్చేదానిపై ఇంకా స్పష్టత రాలేదు. అయితే రైతులు ఎవరూ అధైర్య పడవద్దు.


సీజ్ చేసిన డీజేలతో సీఐ బండారి రాజు

వడూర్ గ్రామంలో నాలుగు డీజేల సీజ్

● నిబంధనలకు విరుద్ధంగా అధిక శబ్దం వచ్చేలా డీజేల ఏర్పాటు

● డీజే యజమానులు, ఆపరేటర్లపై కేసులు : సీఐ

నేరడిగొండ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు నియమ నిబంధనకు లోబడి సౌండ్ బాక్సును ఏర్పాటు చేయాలని అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని ఇచ్చోడ సిఐ బండారి రాజు తెలిపారు. గురువారం నేరడిగొండ మండలం వడూరు గ్రామంలో గణపతి మండపాల వద్ద నిబంధనలకు అధికమించి ఏర్పాటు చేసిన నాలుగు డీజేలను స్వాధీనం చేసుకొని డీజే యజమానులపై, ఆపరేటర్ల పై నేరడిగొండ పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలిగేలా అధిక శబ్దం వచ్చే విధంగా డీజేలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. గణపతి మండపాల వద్ద ఎలాంటి డీజేలకు అనుమతి లేదని అతిక్రమించిన వారి పై చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నేరేడిగొండ ఎస్సై ఇమ్రాన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిలపై కేసు : షీ టీం ఇన్‌చార్జి సుశీల

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వినాయకులను దర్శించుకునేందుకు వచ్చే మహిళలకు షీ టీమ్ బృందం పటిష్ఠ రక్షణ కల్పిస్తోంది. తాజాగా పట్టణంలో మహిళలపై వేధింపులకు గురి చేస్తున్న ఐదుగురిపై కేసులు నమోదు చేసినట్లు షీ టీం ఇన్‌చార్జి ఏఎస్ఐ సుశీల తెలిపారు. మహిళలపై వేధింపులు, వికృత చేష్టలకు పాల్పడుతున్న వీరిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వారిపై తగు చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

ఐదు నెలలుగా అందని వేతనాలు

బోథ్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బందికి గత ఐదు నెలలుగా వేతనాలు అందడం లేదని వాపోతున్నారు. హెచ్ఐవి పరీక్షలు నిర్వహించి ఐసిటీసి సిబ్బందికి ఐదు నెలలు ఏప్రిల్ మాసం నుండి వేతనాలు లేవని వాపోతున్నారు. అంతేకాక ఇదే ఆసుపత్రిలో విధులు నిర్వహించే ముగ్గురు సెక్యూరిటీ సిబ్బందికి వేతనాలు అందడం లేదని వాపోతున్నారు. ఏది ఏమైనా ఐదు నెలలకాలంగా సిబ్బందికి వేతనాలు అందకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు.

చించోలిలో ఉచిత వైద్య శిబిరం

నేరడిగొండ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చించోలి గ్రామంలో శుక్రవారం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేసి, అవసరమైన మందులు అందజేశారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు సంతోష్, సాయన్న, రాణి, పుష్పలత, సుమలత పాల్గొన్నారు.

కుక్కల దాడిలో ఆవు మృత్యువాత

బోథ్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): బోథ్ మండల కేంద్రంలోని మరల పెళ్లి చౌరస్తా సమీపంలోని ఓ దుకాణం వద్ద గురువారం అర్ధరాత్రి గ్రామంలో తిరిగే ఓ ఆవు పైన కుక్కల మంద దాడి చేసింది. దీంతో ఆవు తీవ్ర గాయాలపాలై అక్కడే కుప్పకూలి పోయింది. స్థానికులు శుక్రవారం ఉదయం ఆవు గాయాల పాలైన విషయాన్ని గమనించి సంబంధిత పశు వైద్య సిబ్బందికి సమాచారం ఇచ్చారు. స్పందించిన సిబ్బంది పశువుకు వైద్యం చేస్తుండగానే మృత్యువాత పడింది. కాగా గ్రామంలో కుక్కల మందులు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయని రైతులు ఆందోళన చేస్తున్నారు. తమ తమ పశువులపాకల్లో ఉండే ఆవులపై దాడి చేస్తే తీవ్ర నష్టం సంభవిస్తుందని రైతులంటున్నారు. గ్రామపంచాయతీ వారు కుక్కలను ఇతర ప్రాంతాలకు తరలించాలని పట్టణవాసులు కోరుతున్నారు.


మృతి చెందిన ఆవు


ఉట్నూర్‌లో జ్యోతి ప్రజ్వలన చేస్తూ ప్రారంభిస్తున్న ఏఎస్పీ కాజల్ సింగ్


ఉట్నూర్‌లో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేష్ నిమజ్జనం


గణేష్ నిమజ్జనం దృశ్యం


గణనాథుడికి హారతులు అందిస్తున్న కలెక్టర్, ఎస్పీ

లడ్డూ వేలం పాట


లడ్డూను దక్కించుకున్న తేజ దంపతులను సత్కరిస్తున్న నిర్వాహకులు

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రిమ్స్ వద్ద గల మహా గణపతి ఆలయంలో శుక్రవారం వినాయకుడి లడ్డు వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెమలికొండ తేజ అనుపమ దంపతులు రూ.65 వేలకు లడ్డును దక్కించుకున్నారు. అనంతరం వారిని ఆలయ కమిటీ కమిటీ అధ్యక్షులు మద్నే సురేందర్ ఘనంగా సత్కరించారు. ప్రతీ సంవత్సరం లాగే ఈ సంవత్సరం మహాగణపతి ఆలయం లో లడ్డువేలం పాటతో పాటు అన్నదానం నిర్వహించినట్లు తెలిపారు.

వినాయకుడికి ప్రత్యేక పూజలు


వినాయకునికి ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు, కాలనీ వాసులు

ఆదిలాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కైలాస్‌నగర్ వినాయకుడికి కాలనీ వాసులు ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం వినాయక మండపం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు మంగళహారతులతో వచ్చి వినాయకునికి నైవేద్యాలను సమర్పించారు. ఈ కార్యక్రమానికి ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్ హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో కాలనీ వాసులు మాదస్తుసునిత, లావణ్య, ఆవులశ్రీదేవి తదితరులున్నారు.

వెళ్లి రావయ్యా.. గణపయ్యా

- అంగరంగ వైభవంగా గణేష్‌ల నిమజ్జోత్సవం శోభాయాత్ర
- హాజరైన ప్రజాప్రతినిధులు, ఉన్నత అధికారులు

ఆదిలాబాద్ టౌన్: జిల్లాలో వినాయక నిమజ్జన ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్న నేపథ్యంలో స్థానిక ఆర్ అండ్ బీ గెస్ట్ హౌజ్ వద్ద ప్రతిష్ఠించిన మీడియా కెమెరామెన్ గణేష్ మండలి వద్ద వేడుకలను ఘనంగా చేపట్టారు. కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు నిర్వాహకులు వారికి సాదర స్వాగతం పాలికారు. ప్రత్యేక పూజల అనంతరం శోభాయాత్రను ప్రారంభించగా.. మీడియా మిత్రులతో ఉన్నతాధికారులు సరదాగా నృత్యాలు చేసి సందడి చేశారు. అనంతరం వారిని శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.

ఉట్నూర్: తొమ్మిది రోజులుగా ఘనంగా పూజలు అందుకున్న ఆదిదేవుడు గణేష్ విగ్రహాలకు అంగరంగ వైభవంగా నిమోజోత్సవం నిర్వహించారు. ఉట్నూర్ మండల కేంద్రం లో ప్రతిష్ఠించిన 60కి పైగా గణేష్ విగ్రహాలను రతాలపై అందంగా అలంకరించి శోభయాత్రకు గణేష్ మండలి నిర్వాహకులు ఉట్నూర్ పట్టణంలోని అష్ట కూడలికి తీసుకోవచ్చారు. హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ముందుగా పూజారి బాలాజీ దుబే ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ కాజల్ సింగ్, రామ్ సింగ్ మహారాజ్,ముడుపు యాదిరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి సభా వేదిక కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరంహిందువు ఉత్సవ సభకి ముఖ్య అతిథులుగాఖానాపూర్ శాసన సభ్యులు వెడ్మ బోజ్జు పటేల్, ?లాముఖి ఆలయ వ్యవస్థాపకులు రామ్ సింగ్ మహారాజ్, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, ఏ ఎస్ పి కాజల్ సింగ్, బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రితేష్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు భరత్ చౌహన్, ఉత్సవ సమితి అధ్యక్షుడు గూగులోత్ శ్రీరామ్ నాయక్, ప్రధాన కార్యదర్శి సాడిగే రాజేశ్వర్‌లు పాల్గొని ప్రసంగించాం. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన తెలంగాణ రాష్ట్ర హిందూ వాహిని సంఘటన మంత్రి ముడుపు యాదిరెడ్డి మాట్లాడుతూ బాల గంగాధర్ తిలక్ ప్రారంభించిన గణేష్ ఉత్సవాలతో ప్రజలందరూ సామూహిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని అన్నారు.

బజార్ హత్నూర్: మండల కేంద్రంలో శివాజీ మార్కెట్, భీం సైనిక్, మైసమ్మ, సూర్య, ఆదర్శ యూత్ తో పాటు గిర్నూర్, దే గామ గ్రామాల్లో శుక్రవారం వినాయక నిమజ్జనాన్ని ఘ నంగా నిర్వహించారు. మండపం వద్ద వినాయకుడి కి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం వి నాయకున్ని ప్రధాన వీధుల గుండా డప్పుల దరువు, డీజే పాటలు, కోలాటం ఆడుతూ శోభ యాత్రను నిర్వహించా రు. సాయంత్రం సమీపంలో ఉన్న వాగులో ని మజ్జనం చేశారు. ఈ కార్యక్రమాలతో గ్రా మాల్లో సందడి వాతావరణం నెలకొంది.

పల్లెలను తాకిన లడ్డూల వేలం

బాసర, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గణేష్ నవరాత్రుల సందర్భంగా పల్లె పల్లెల్లో గణనాథుని విగ్రహాల వద్ద లడ్డుల వేలం హోరాహోరిగా సాగుతోంది. ఊరూరా భక్తులు, దాతలు పోటీపడి లడ్డులను గెలుచుకుంటున్నారు. ఎక్కడ చూసినా లడ్డూ వేలం ఒక పండగ వాతావరణం సృష్టిస్తోంది. మొదట పట్టణాల్లో మొదలయిన ఈ సంస్కృతి పల్లెలను తాకింది. చిన్న ఊళ్లలో కూడా అధిక ధరలు పలుకుతున్నాయి. బాసర మండలంలో దాదాపు అన్ని గ్రామాల్లో ఈ వేలం పాటలు కొనసాగుతున్నాయి. కొత్తగా మొదలెట్టినప్పుడు వేళల్లో పోతున్న లడ్డులు తర్వాత భక్తి సెంటిమెంటు పెరిగి అధిక ధరలు పలుకుతున్నాయి. ఈ ట్రెండు గత రెండు మూడు ఏళ్ల నుంచి ఎక్కువయింది. ప్రస్తుతం గల్లిలో కొలువుదీరే గణపతుల్లో వద్ద కూడా రూపాయలు 10-50 వరకు లడ్డూలను పాటల్లో పాల్గొని తీసుకుంటున్నారు. గణనాథుడి ప్రసాదం పొందితే శుభం కలుగుతుందనే నమ్మకంతో రైతులు, వ్యాపారులు, దాతలు పెద్ద ఎత్తున వేలల్లో పాల్గొంటున్నారు. పేద మధ్యతరగతి వర్గాలు సైతం పోగుచేసిన సొమ్ముతో లడ్డూలను పొందేందుకు పోటీ పడుతున్నారు. మరికొందరు స్టేటస్ కోసం కూడా లడ్డులను దక్కించుకున్నట్లు పల్లెల్లో చర్చ జరుగుతుంది. ఎవరెవరు ఎక్కువ ధర చెబుతారో చూసేందుకు ప్రజలు గుంపులు గుంపులుగా తరలివస్తున్నారు. వేల గెలుచుకున్న వారు గణ నాథుడి ప్రసాదాన్ని తమ ఇళ్లకు తీసుకెళ్లి గ్రామస్తులతో పంచుకుంటూ ఆధ్యాత్మిక ఆనందరం పంచుకుంటున్నారు. ఈ లడ్డూ వేలాల వల్ల పల్లెల్లో పండుగ కమ్మిన వాతావరణం నెలకొని అందరూ ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

నేరడిగొండలో..

నేరడిగొండ: మండలంలోని సావర్గాం, పెద్ద బుగ్గారాం తదితర గ్రామాల్లో శుక్రవారం గణేష్ నిమజ్జన ఉత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మంగళవాయిద్యాలు, మహిళల కోలాటం, యువతీయువకుల నృత్యాల నడుమ శోభాయాత్రను కన్నుల పండగగా నిర్వహించారు. అనంతరం గ్రామాల సమీపంలో గల వాగులలో వినాయక నిమజ్జనం చేశారు.

తాంసి మండలంలో ..

తాంసి: మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో గురు, శుక్రవారాలు గణేశ నిమజ్జనం అంగరంగ వైభవంగా జరిగింది. తొమ్మిది రోజులపాటు నియమ నిష్ఠలతో ప్రతిష్ఠాపన చేసిన గణేష్‌లను ఆయా గ్రామాల సమీపాల్లో ఉన్న వాగుల్లో గణపతిల నిమజ్జనం చేశారు. భాజా భజంత్రీలు, మేలా వాయిద్యాలు, కోలాటాలు, డీజే చప్పుడుల మధ్య ఎంతో కోలాహలంగా ఈ ఉత్సవాలు నిర్వహించారు. ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ జీవన్ రెడ్డి ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలో వినాయకుడి నిమజ్జనం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని పలు కాలనీల్లో 9 రోజులపాటు పూజలందుకున్న విగ్రహాలను గంగమ్మ ఒడికి నిమజ్జనానికి తరలించారు. నిమజ్జన ఉత్సవాలను అత్యంత వైభవంగా జరిపారు. ముందుగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వీధుల్లో మేళ తాళాలు, డప్పుశబ్దాల మధ్య వినాయ కుడిని ఊరేగించారు. విగ్రహాల ముందు చిన్నపిల్లలు, యువ కులు సంతోషాలతో డ్యాన్స చేశారు. ఎలాంటి అవాంచ నీయ సంఘటనలు జరగకుండా స్థానిక ఎస్సై ఇ. సాయన్న ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించగా విగ్రహాలతో శోబాయాత్ర నిర్వహించి ఏమైయికుంట గ్రామ సమీపంలో చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ డోంగ్రే మారుతి పటేల్, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు చింతావార్ సంతోష్, ముస్లే కేశవ్ పటేల్, ముండే బాబు, చామత్వార్ సంజీవ్, జైస్వాల్ ఘనశ్యామ్ లాల్, తదితరులు పాల్గొన్నారు.


మేళతాలల మధ్య వినాయకునికి ఊరేగిస్తున్న దృశ్యం


బజార్ హత్నూర్ మండల కేంద్రంలో శోభాయాత్రలో నృత్యం


నిమజ్జనానికి తరలివెళుతున్న సావర్‌గామ్ యువకులు


గణేష్ నిమజ్జనంలో పాల్గొన్న యువకులు

నర్సాపూర్‌లో కోతుల దాడులు

- పదేళ్ల బాలికతో పాటు 55 ఏళ్ల వృద్ధుడికి గాయాలు


కోతుల దాడిలో గాయపడ్డ విక్రమ్

నర్సాపూర్(జి), సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కోతుల బెడద తీవ్రంగా పెరిగిపోవడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కేవలం పది రోజుల వ్యవధిలోనే రెండు వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు వ్యక్తులు కోతుల దాడిలో గాయపడ్డారు. పది రోజుల క్రితం కుస్లి గ్రామానికి చెందిన 9 ఏళ్ల బాలిక సాత్వికపై ఒక కోతి దాడి చేయడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన జరిగిన వెంటనే ఆమెను కుటుంబ సభ్యులు చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఆస్పత్రి సమీపంలోని పదవ వార్డు లో నివాసం ఉంటున్న 55 ఏళ్ల విక్రమ్‌పై శుక్రవారం ఒక కోతి దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. ఈ సంఘటన జరగగానే స్థానికులు వెంటనే స్పందించి విక్రమ్‌ను ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. వరుసగా జరుగుతున్న ఈ దాడులు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. అధికారులు తక్షణమే స్పందించి కోతుల బెడదను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని, ప్రజలను ఈ ప్రమాదాల నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. లేనిపక్షంలో ఇలాంటి ఘటనలు ఇంకా పెరిగే అవకాశం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా ఫ్రెండ్‌షిప్ గాజుల పండుగ

కుంటాల, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): కుంటాల మండలంలోని ఓలా గ్రామంలో శుక్రవారం ఫ్రెండ్‌షిప్ గాజుల పండుగను మహిళలు ఘనంగా జరుపుకున్నారు. ఇటీవల మార్కెట్‌లో కొత్తగా ప్రారంభమైన ఈ గాజుల పండుగను పురస్కరించుకొని ఆయా గ్రామాల్లో ఒక సామాజిక వర్గానికి చెందిన మహిళలు, ఆలయాల వద్దనో లేదా వినాయక మండపాల వద్దనో లేదా ఫంక్షన్ హాల్‌లో అందరూ ఒకచోట కలిసి గోరింటాకు పెట్టుకోవడం ఒకరికొకరు గాజులు వేసుకోవడం అనంతరం వన భోజనాలు చేయడం సాయంత్రం వరకు అక్కడే గడుపుతూ ఈ ఫ్రెండ్ షిప్ గాజుల పండుగను నిర్వహించుకుంటున్నారు. ప్రతిరోజు ఇంటి పనులలో తీరి క లేకుండా గడిపే తాము ఈ గాజుల పండుగతో ఒకరోజు దినమంతా తమ మిత్రులు, దగ్గరి బంధువులతో కలిసి ఉపశమనం పొందుతున్నామని మహిళలు పేర్కొంటున్నారు. కాగా ఓలా గ్రామంలో గౌడ సంఘానికి చెందిన మహిళలు శుక్రవారం ఈ కార్యక్రమం చేపట్టారు.

కనువిందు చేసిన ఇంద్రధనస్సు

బజార్ హత్నూర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బజార్ హత్నూర్ మండలం ముత్యంపేట కాలనీ శివారులో కనువిందు చేసింది. కాగా మధ్యాహ్నం పూట మోస్తారుగా వర్షం కురిసింది. ఆ తర్వాత సాయంత్రం సమయంలో మండలంలోని గిర్నూర్, బలాన్ పూర్ గ్రామ పరిసర ప్రాంతాల నుంచి పొలాల మీదుగా ఆకాశంలో ఇంద్రధనస్సు ప్రత్యక్షమైంది. ఓ వైపు ఎండ మరో వైపు చిన్నపాటి చినుకులతో ఇంద్రధనస్సు చూపర్లను ఆకట్టుకుంది.


బజార్‌హత్నూర్ పరిసర ప్రాంతాలలో వెలసిన ఇంద్ర ధనుస్సు

సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి ప్రత్యేక స్థానం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అతిథులు


సాయిలింగి కేజీబీవీలో ఉపాధ్యాయ దినోత్సవం


సునీత


లీలావతి


సంతోష్‌కుమార్

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): సమాజానికి ఉత్తమ పౌరులను అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉం టుందని డీసీసీబీ మాజీ చైర్మన్ దామోదర్ రెడ్డి అన్నారు. శ్రీమహాలక్ష్మీ హోండ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధకృష్ణ జయంతిని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న పలువురు ఉపాధ్యాయులను శాలువాతో సత్కరించి జ్ఞాపికలను అందించారు. ఒక వ్యక్తి క్రమశిక్షణతో జీవనం సాగించాలన్న, సమాజంలో గౌరవంగా జీవించలన్న దానికి గురువుల కృషి ఎంతో ఉంటుందని డీసీసీబీ మాజీ చైర్మన్ దామోదర్ రెడ్డి అన్నారు. తాను రాజకీయాల్లో రాణిస్తున్నరంటే దానికి కారణంగా ఉపాధ్యాయులేనని, వారి బోధనలతోనే ఈ స్థాయి లో ఉన్నానని తెలిపారు. ప్రతీఒక్కరు వారికి విద్యా బుద్దులు నేర్పించిన ఉపాధ్యాయులను విస్మరించొద్దని కోరారు. ఈ కార్యక్రమంలో మహాలక్ష్మీ హోండ ఎండి నకుల్ రెడ్డి, శ్రవణ్ కుమార్‌పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులు వీరే..

నేరడిగొండ: జ్ఞానామృతాన్ని అందించే దైవం, చీకట్లు పారదోలి వెలుగులు పంచే దివ్వె... జీవన గమ్యానికి మార్గనిర్దేశం చేసే మహర్షి గురువు దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే పురుడు పోసుకుంటుంది అని నాడు పెద్దలు చెప్పారు. ఈ ప్రపంచంలో గురువే సమస్తం. రేపటి పౌరుల బంగారు భవితను అందించే మహత్తర శక్తి ఉపాధ్యాయులకే ఉంది. నేరడిగొండ మండలం నుంచి ఉత్తమ ఉపాధ్యాయులుగా జిల్లా స్థాయి అవార్డు అందుకున్న సునీత ఎస్ఏ, ఎంపీయూపీఎస్ బుగ్గరాం బి,లీలావతి ఎస్‌జీటీ ఎంపీయూపీఎస్, బుగ్గరాం బి, సంతోష్ కుమార్ ఎస్‌జీటీ, ఎంపీపీఎస్ తేజాపూర్‌కు పీఆర్‌టీయూ టీఎస్ నేరడిగొండ మండల శాఖా అధ్యక్ష, కార్యదర్శులు కటుకూరి గంగాధర్, శ్రీనివాస్ గౌడ్‌లతో పాటు మండల ఉపాధ్యాయులు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

తలమడుగు: చదువుతూనే విద్యార్థులకు ఉద్యోగ భవిష్యత్తు లభిస్తుందని సాయిలింగి కస్తూరి గాంధీ పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ అర్చన అన్నారు. శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చదువుకున్నప్పుడే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందవచ్చన్నారు. ముఖ్యంగా ఆడపిల్లలు చదువుకొని ఉ ద్యోగ ఉపాధి అవకాశాలు సద్వినియోపరుచుకోవాలని కోరారు. ఆడపిల్లల చదువుల కోసం ప్రభుత్వాలు కస్తూర్బా పాఠశాల ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం


ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న సంతోష్‌ను సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్, డీఈవో తదితరులు

తాంసి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తాంసి మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ముగ్గురు ఉపాధ్యాయులకు జిల్లా కలెక్టర్ వారిని సన్మానించి పాటు ప్రశంసా పత్రాలను అందచేశారు. ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కేంద్రంలో పలువురు ఉపాధ్యాయులు వీటిని అందుకున్నారు. కప్పర్ల పాఠశాలకు చెందిన సంతోష్, జామిడీ ప్రాథమిక పాఠశాలకు చెందిన రవీందర్లు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికయ్యారు. వీరికి జిల్లా కలెక్టర్ రాజార్షి షాతో పాటు డీఈవో ఖుష్బూ, ఇంచార్జి కలెక్టర్లు, పలు అధికారులు మండల ఉద్యమ ఉపాధ్యాయులను సన్మానించి ప్రశం సా పత్రం అందజేశారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన వారిని మండల వాసులు అభినందించారు. విద్యార్థులకు మంచి బోధన చేస్తే గుర్తింపు వస్తుందని పలువురు పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి

andhrajyothy.com





వినాయక్ సాగర్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల

వర్షాకాలం వాగు వెనకే...

● ఇరవై గ్రామాలకు ఇబ్బందులు



కడెం వాగు



రెండేళ్ల క్రితం భారీ వర్షాలకు కొట్టుకపోయిన పస్పుల వంతెన దృశ్యాలు (ఫైల్)

- రాకపోకలకు తీవ్ర ఆటంకం
- సాహసం చేస్తేనే బాహ్య ప్రపంచంలోకి
- ఏళ్లు గడుస్తున్నా...
- మారని ఆదివాసి పల్లెల దుస్థితి

నిర్మల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లాలోని దాదాపు ఇరవైకి పైగా ఆదివాసి పల్లెలు వర్షాకాలం వచ్చిందంటే గజగజ వణికిపోతుంటాయి. దేశం అభివృద్ధి దిశగా... రాకెట్ వేగంతో పయనిస్తుందని చెప్పుకుంటున్న పాలకుల దృష్టికి ఈ గ్రామాలు కనిపించకపోవడం మాత్రం విశేషంగా చెబుతున్నారు. భారీ వర్షం కురిసింది అంటే ఈ 20 ఆదివాసి గ్రామాలు తమకు ఆనుకుని ఉన్న వాగుల వెనుకనే ఉండిపోవాల్సి వస్తుంది. రోజుల తరబడి ఈ 20కి పైగా ఆదివాసి గూడాలు బాహ్య ప్రపంచానికి దూరంగా ఉంటూ వాగుల ఉధృతి తగ్గేవరకు అప్రకటిత కర్ఫ్యూలా అవుతుంది. ముఖ్యంగా జిల్లాలోని కడెం, పెంబి మండలాల్లోని ఈ గ్రామాలన్నీ వర్షాకాలంలో వాగులను దాటలేక... తిండి తిప్పలకు చిక్కుకుని ఎదుర్కొంటాయి. రోజుల తరబడి తిండి తిప్పలు దొరకక... ఉన్న దాంట్లోనే సర్దుకుపోతాయి. ప్రతి ఐదేళ్లకోసారి ఓట్ల కోసం ఈ పల్లెలకు వచ్చే అన్ని పార్టీల నేతలు తాము ఆదు కుంటామంటూ ఇస్తున్న హామీలన్నీ గాలి మూట లవుతున్నాయి. అయితే ఎన్నికల అనంతరం ఏ ఒక్క పార్టీ నాయకుడు ఈ పల్లెల వైపు కన్నెత్తి చూడ కపోతుండడం వారి అమాయకత్వానికి నిదర్శనంగా చెబుతుంటారు. దట్టమైన అడవుల మధ్య ఉన్న ఈ పల్లెలకు వాగులు, వం కలు... ఓవైపు శాపం అవుతుండగా... మరోవైపు అటవీ చట్టాలు వారికి ప్రాణ సంకటమవుతు న్నాయి. వీరికి ఇబ్బందులు కలిగించే వాగులు, వంకలపై వంతెనలు నిర్మించాలని ఆదివాసీలు కోరుతున్నారు. అయితే అటవీచట్టాల కారణంగా అభివృద్ధిపనులు చేపట్టేందుకు ప్రభుత్వానికి పాల నాపరమైన ఇబ్బందులు తలెత్తుతుండడం కూడా ఆదివాసీల సమస్యలకు ఆజ్యం పోస్తుంది.

ఆ ఇరవై గ్రామాలు...

జిల్లాలోని పెంబి, కడెం మండలాల పరిధిలోని దట్టమైన అడవుల్లో ఉండే ఇరవై గ్రామాలకు పైగా వర్షాకా లంలో తీవ్రమైన సమస్యను ఎదుర్కొంటున్నాయి. ముఖ్యంగా పస్పుల గ్రామంతో పాటు హరిచంద్ తండా, తులసిపేట్, గుమ్మెన, ఎంగ్లా పూర్, వస్‌పల్లి, దొందారి, రాంనగర్, యాపల్‌గూడ, సత్తుగూడ, వెంకం పోచంపాడ్, రాయదారి, అంకెన, కర్లం లొద్ది, నాయకపు గూడ తదితర గ్రామాలన్నీ వర్షాకాలంలో వాగుల ఉధృతి కారణంగా జలదిగ్బంధంలో చిక్కుకుంటున్నాయి. ఏకధాటిగా కురిసే వర్షాలతో ఈ గ్రామాలకు అడ్డుగా ఉన్న వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తుంటాయి. దీంతో ఈ పల్లెలన్నీ 15 నుంచి 20 రోజుల వరకు బాహ్య ప్రపంచానికి దూరంగా ఉండిపోతుండడం సహజంగా మారుతోంది. అత్యవసర పరిస్థితులు ఎదురైతే మాత్రం వారికి దేవుడే దిక్కుగా నిలవాల్సి వస్తుంది. ముఖ్యంగా నిత్యావసర సరుకులు, తాగునీటి విషయాలు వాగుల ఉధృతి తగ్గే వరకు తీవ్రమైన ఇబ్బందులు తప్పడం లేదు.

అటకెక్కిన అభివృద్ధి పనులు...

ఈ ఇరవై ఆదివాసి గ్రామాల రాకపోకలను మెరుగుపరిచేందుకు తీసుకుంటున్న చర్యలపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా కడెం వాగు, దొత్తి వాగుల పరివాహక ప్రాంతాలలోని ఈ మారుమూల పల్లెలకు రాకపోకల కోసం తీసుకుంటున్న చర్యలు అభాసుపాల వుతున్నాయి. కాగా ఈ గ్రామాలకు రాకపోకలు మెరుగుపరిచేందుకు రెండేళ్లక్రితం వాగుపై నిర్మించిన పస్పుల వంతెన భారీవర్షం దాటికి పూర్తిగా కొట్టుకుపోయింది. డిజైన్ లోపంతో పాటు నాణ్యత పాటించకపోవడంతో నిర్మించిన కొద్ది రోజులకే ఈ వంతెన కుప్ప కూలింది. అలాగే దొత్తి వాగుపై నిర్మించ తలపెట్టిన వంతెన పనులు చాలా నెలల నుండి నిధుల కొరత పుణ్యమా అని పెండింగ్‌లో పడిపోయాయి. వాగులపై వంతెనలతో పాటు తాత్కాలిక రోడ్లను సైతం నిర్మించ కపోతుండడం ఆదివాసీలకు నరకయాతనను కలిగిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం ఆదివాసీలను ఆదుకునేందుకు కోసం అటవీ నిబంధనలకు లోబడి వంతెనలను నిర్మించాలని కోరుతున్నారు.

దొత్తి వాగుపై బ్రిడ్జి నిర్మించాలి...

● సురేందర్, యాపల్‌గూడ



దొత్తి వాగుపై బ్రిడ్జి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వర్షం కురిసినప్పుడు వాగు పొంగడంతో మూడు నాలుగు రోజులు బాహ్య ప్రపంచానికి దూరంగా ఉండాల్సిన పరిస్థితి ఉంది. వాగు దాటుతుండగా ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. అధికారులు స్పందించి దొత్తి వాగుపై వంతెన నిర్మించాలి.

పస్పుల వంతెన పూర్తిచేయాలి...

● బలరాం నాయక్, తులసిపేట్



వంతెన నిర్మించి సంవత్సరం గడవక ముందే వర్షంకు కొట్టుకుపోయింది. వంతెన లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఆసుపత్రికి వెళ్లాలంటే ఎడ్లబండిలో తీసుక వెళ్తున్నాం. ఎంతో మంది నాయకులు, అధికారులు వచ్చి చూసి వెళినా ఎవరు పట్టించుకుంటలేరు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు పట్టించుకొని వంతెన పునర్నించాలి.

విదేశాల్లో మరణించిన వ్యక్తికి రైతు బీమా



ఫేక్‌డెత్ సర్టిఫికెట్



క్లెయిమ్ ఫారం

నర్సాపూర్(జి), సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పటి చిరంజీవి సినిమా ఠాగూర్‌లో చూపించినట్టు మరణించిన వ్యక్తి పేరుతో నకిలీ పత్రాలు సృష్టించి ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని కొందరు స్వాహా చేశారు. బతుకుతెరువు కోసం విదేశాలకు వెళ్లిన నర్సాపూర్ మండల కేంద్రానికి చెందిన కోడే ముత్యం అనే వ్యక్తి 2018లో గుండెపోటుతో మరణించారు. అయితే తెలంగాణ ప్రభుత్వం అందించే రైతు బీమా పథకం కింద రైతు కుటుంబానికి రూ. 5 లక్షల ఆర్థిక సహాయం వస్తుందని తెలిసి, కొందరు ఈ పథకాన్ని దుర్వినియోగం చేశారు. ముత్యం మరణించిన చాలా కాలం తర్వాత ఒక గ్రామ పంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్, రాజకీయ నాయకుడి సహకారంతో 2020లో నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాన్ని సృష్టించారు. నకిలీ సంతకాలు, ముద్రలతో ఈ సర్టిఫికెట్‌ను ఉపయోగించి, మండల వ్యవసాయ విస్తరణ అధికారి లాగిన్ ద్వారా బీమా కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆ రూ.5లక్షలు ముత్యం కుటుంబసభ్యుల ఖాతాలో జమ అయ్యేలా చేశారు. ఈ మోసం ఐదేళ్లుగా అనుమానాలకు తావిచ్చినా స్పష్టమైన ఆధారాలు లభించలేదు. మండల కేంద్రానికి చెందిన ఒక వ్యక్తి సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) కింద దరఖాస్తు చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఉన్నతాధికారుల అప్పీలు తర్వాత మండల వ్యవసాయ అధికారులు సర్టిఫైడ్ కాపీలను అందించడంతో ఈ కుంభకోణం బయటపడింది. ఇటీవల ప్రభుత్వ సొమ్మును పంచుకున్న ఒక వర్కర్ ఖాతాలో తేడాలు రావడంతో ఈ వ్యవహారంపై మరింత చర్చ జరుగుతోంది. ప్రస్తుత మండల వ్యవసాయ అధికారి ఇది తన హాయంలో జరిగింది కాదని వివరించారు. ప్రస్తుత మండల వ్యవసాయ అధికారి రామచంద్ర నాయక్ ఈ ఘటనపై స్పందించారు. ఈ వ్యవహారం తన హయాంలో జరిగింది కాదని ఆయన స్పష్టం చేశారు. నకిలీ ధ్రువపత్రాల సృష్టి, ఆర్థిక సహాయం స్వాహా మొత్తం తాను బాధ్యతలు చేపట్టక ముందే జరిగిందని ఆయన వివరించారు.

మోసాలకు అడ్డుకట్ట వేయాలి...

● సయ్యద్ కలీం, లా స్టూడెంట్, చాక్‌పల్లి



తెలంగాణ ప్రభుత్వం 2018 ఆగస్టు 14న ప్రారంభించిన రైతు బీమా పథకం 18-59 ఏళ్ల రైతులకు రూ. 5 లక్షల జీవిత బీమా అందిస్తుంది. అయితే ఈ పథకాన్ని కొందరు దుర్వినియోగం చేస్తున్నారు. 2018 డిసెంబరులో విదేశాల్లో మరణించిన ఒక వ్యక్తి పేరుపై నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి మోసం చేశారు. జనన, మరణ నమోదు చట్టం (1969) ప్రకారం విదేశాల్లో మరణించిన వారికి అక్కడి భారత రాయబార కార్యాలయం ద్వారా మాత్రమే ధ్రువ పత్రం జారీ అవుతుంది. కానీ మోసగాళ్లు నకిలీ పత్రాలు సృష్టించి, పథకం నిబంధనలను ఆసరాగా తీసుకుని డబ్బులు స్వాహా చేస్తున్నారు. ఈ మోసాలను అరికట్టడానికి ఐపీసీ 420 (మోసం), 468 (ఫోర్జరీ) సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలి. ప్రభుత్వ అధికారులు, బ్యాంకు సిబ్బందిపై నిఘా పెట్టి బాధ్యులకు కఠిన శిక్ష పడేలా చూడాలి. నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చూడాలి.

శోభాయాత్రపై నిఘా

- 180 సీసీ కెమెరాలు కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం
- 508 మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రత
- రూట్ మ్యాప్‌ను పర్యవేక్షించిన ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్‌లో నిర్వహించనున్న వినాయక నిమజ్జన మహోత్సవం శనివారం వేడుకలపై పోలీసులు డేగకన్నుతో పర్యవేక్షిస్తున్నారు. జిల్లా కేంద్రంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. శుక్రవారం నిమజ్జన శోభాయాత్ర రూట్ మ్యాప్‌ను ఎస్పీ జానకి షర్మిల పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నిమజ్జన ఘాట్ల వద్ద ఉన్న గజఈతగాళ్లు, క్రేన్ ఆపరేటర్లతో ఆమె మాట్లాడారు. అదే సమయంలో నిమజ్జనానికి వచ్చిన విగ్రహానికి ఎస్పీ ప్రత్యేకపూజలు నిర్వహించి నిమజ్జనాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... గణేశుడి శోభాయాత్రకు విస్తృతమైన భద్రతఏర్పాట్లను చేసినట్లు పేర్కొన్నారు. నిమజ్జన శోభాయాత్ర మార్గంలో, నిమజ్జన ఘాట్ల వద్ద, పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఉన్న 180 సీసీ కెమెరాలను కంట్రోల్ రూమ్‌తో అనుసంధానం చేసినట్లు తెలిపారు. పట్టణంలో 508 మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లను చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. ఈ భద్రత బృందంలో జిల్లా ఎస్పీతో పాటు ఒక అడిషనల్ ఎస్పీ, ఇద్దరు ఏఎస్పీలు, 11 మంది ఇన్‌స్పెక్టర్లు, 31 మంది ఎస్సైలు, 106 మంది ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, 323 మంది కానిస్టేబుళ్లు, 31 మంది మహిళా పోలీసులతో నిర్మల్‌లో వినాయక నిమజ్జన మహోత్సవ భద్రత ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. డీజేల ఉపయోగంలో హైకోర్టు ఆదేశాలను పాటించాలన్నారు. పరిమితికి లోబడి డీజేలు ఉపయోగించాలని సూచించారు. మితిమీరి డీజేలను ఉపయోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినాయక నిమజ్జన మహోత్సవంలో శాంతి భద్రతలకు ప్రాధాన్యతను ఇస్తామని ఎస్పీ వెల్లడించారు. పోలీసుల సూచనలను పాటించి శాంతియుత వాతావరణంలో గణేష్ నిమజ్జన ఉత్సవాలను జరుపుకోవాలని ఆమె కోరారు. ఎస్పీ వెంట ఏఎస్పీ రాజేష్ మీనా, ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఆర్ఐ రామ్‌నిరంజన్ రావు, తదితరులున్నారు.

ఉపాధ్యాయ వృత్తి గొప్పది

● జిల్లా విద్యాశాఖ అధికారి డి.భోజన్న



సర్వేపల్లి రాధాకృష్ణన్‌కి నివాళులర్పిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చినవాడు సర్వేపల్లి రాధాకృష్ణన్ అని జిల్లా విద్యాశాఖ అధికారి డి.భోజన్న అన్నారు. శుక్రవారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి.భోజన్న సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు అలంకరించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గౌరవనీయమైన ఉపాధ్యాయ వృత్తికి న్యాయం చేసి, ఉపాధ్యాయ వృత్తి నుంచి అంచెలంచెలుగా ఎదిగి, భారత రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన సర్వేపల్లి రాధాకృష్ణన్ గురించి వారి జీవిత విశేషాల గురించి తెలియజేసి, ఉపాధ్యాయ వృత్తికి వన్నెతెచ్చిన వ్యక్తి సర్వేపల్లి రాధాకృష్ణ అని అభివర్ణించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు అందరూ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉన్నతమైన భావాలు, ఆశయాలు అందిపుచ్చుకొని ఉపాధ్యాయ వృత్తికి పూర్తి న్యాయం చేకూర్చాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ సెక్టోరల్ అధికారులు రాజేశ్వర్, ప్రవీణ్ కుమార్, లింబాద్రి, జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డ్ సహాయ కార్యదర్శి భానుమూర్తి పాల్గొన్నారు.

తైబజార్ రుసుం చెల్లించొద్దు

● నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఇక నుంచి తైబజార్ రుసుము చెల్లించవద్దని పత్రిక ప్రకటనలో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. పట్టణంలో తై బజార్ కారణంగా చిన్న చిన్న వ్యాపారులకు ఇబ్బందులు ఎదుర వుతున్నాయని బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి జిల్లా కలెక్టర్‌తో, అదనపు కలెక్టర్‌తో, ఇతర అధికారులతో మాట్లాడి పట్టణంలో ఈ తై బజార్ టెండర్ ప్రక్రియను రద్దు చేయాలని తెలిపారు. పట్టణంలోని చిన్న చిన్న వ్యాపారులకు ఇక నుండి వ్యాపార నిర్వహణ కొరకు ఎటువంటి రుసుము చెల్లించకూడదని, వ్యాపారాలు సాఫీగా కొనసాగించుకోవాలని తెలిపారు.

మస్కాపూర్ ప్రధానోపాధ్యాయుడికి అవార్డు



రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకుంటున్న బోనగిరి నరేందర్

ఖానాపూర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని మస్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బోనగిరి నరేందర్ రావుకు అరుదైన గౌరవం దక్కింది. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను అన్ని రంగాల్లో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్ది రాష్ట్ర వ్యాప్తంఆ మస్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు పేరు, ప్రఖ్యాతలు సాధించి పెట్టిన ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేందర్ రావు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికయ్యారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా చేతుల మీదుగా నరేందర్ రావు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డును అందుకున్నారు. గత ఏడాది పదవ తరగతిలో మస్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు సాధించిన ఘనతను ప్లెక్సీల ద్వారా ఖానాపూర్ పరిసర ప్రాంతాల్లో నరేందర్ రావు హోరెత్తించారు. ఒక ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు సైతం ప్రైవేట్‌కు ధీటుగా ఫలితాలు సాధించగలరని నిరూపిస్తూ పాఠశాలలో చేపడుతున్న కార్యక్రమాలతో పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న నరేందర్ రావుకు ఈ అవార్డు దక్కడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నర్సాపూర్‌లో గణేష్ నిమజ్జనంలో అపశ్రుతి

నర్సాపూర్(జి), సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ మండల కేంద్రంలో గణేష్ నిమజ్జన వేడుకల్లో విషాదం చోటుచేసుకుంది. చాకలి ఐలమ్మ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నిమజ్జనం సందర్భంగా అపశృతి జరిగి ఇద్దరు యువకులు గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే నిమజ్జనం కోసం విగ్రహాన్ని తరలిస్తున్న సమయంలో విగ్రహానికి అమర్చిన భారీఫ్రేమ్ అదుపు తప్పి పక్కనే ఉన్న యువకుల కాళ్లపై పడింది. ఈ ప్రమాదంలో మండల కేంద్రానికి చెందిన సట్ల ముత్యం అనే యువకుడి ఎడమ కాలు తీవ్రంగా విరిగింది. అదే సమయంలో సట్ల కళ్యాణ్ అనే మరో యువకుడికి స్వల్పగాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి, కళ్యాణ్‌కు ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం తీవ్రంగా గాయపడిన ముత్యంను హుటాహుటిన 108 అంబులెన్స్‌లో నిర్మల్ ఆసుపత్రికి తరలించారు. నిమజ్జన వేడుకల్లో అపశృతి జరగడంతో అక్కడ ఉన్న వారంతా ఆందోళనకు గురయ్యారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిమజ్జనం లాంటి సందర్భాల్లో మరింత జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచించారు.

ఆర్జీయూకేటీలో శిక్షణా శిబిరం

బాసర, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : బాసర ఆర్జీయూకేటీలోని ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం(ఇ.ఇ.ఇ) అంతర్గత విద్యార్థి సంఘం నెక్సస్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు మ్యాట్లాబ్, మాత్రికా పరికర్మ, భావనా, చిత్రణ, కృత్రిమ వాతావరణ కల్పనలను గురించి విద్యార్థులకు ప్రాథమిక అవగాహన కల్పించడమే లక్ష్యంగా మ్యాట్లాబ్ బూట్ శిక్షణా శిబిరం శుక్రవారం ప్రారంభించారు. మూడు రోజుల పాటు కార్యక్రమం జరగనుంది. మొదటి రోజు విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ గోవర్ధన్, ఓఎస్‌డీ మురళీదర్శన్, యంత్రశాస్త్ర విభాగ ఉపపీఠాధిపతి డాక్టర్ కే. మహేశ్ సమక్షంలో బూట్ క్యాంప్ ప్రారంభించారు. ఐఐటీ బొంబాయిలో పీఎంఆర్ఎఫ్ ఫెలో అయిన అబిశ్వజిత్ సాహా ఈ సమావేశాలను నిర్వహించారు. ఆయన మ్యాట్లాబ్ ప్రాథమిక అంశాలు, యంత్రశాస్త్రం పరిశోధనలో దాని నిజ సమయ అనువర్తనాలపై ఉపయోగకరమైన ఉపన్యాసాలు, ప్రయోగాత్మక ప్రదర్శనలు ఇచ్చారు. వారి నైపుణ్యం, ఆకర్షణీయమైన బోధన శైలి, మ్యాట్లాబ్ యొక్క అధునాతన లక్షణాలను అన్వేషించడానికి విద్యార్థులను ప్రేరేపించే విధంగా ఉన్నాయి. ఈ కార్యక్రమాన్ని విద్యార్థి సమన్వయ కర్తలు జి. వంశీ, సర్ధార్ పుల్లాసింగ్, ఆధ్యాపక సమన్వయ కర్తలు డాక్టర్ భుక్యాభావ్‌సింగ్, ఇఇఇ విభాగం అధిపతి అసిస్టెంట్ ప్రొఫెసర్ లక్ష్మణ్ ముత్యం, సమన్వయం చేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ శోభన్ భుక్య, ఇ.ఇ.ఇ విభాగానికి చెందిన ఇతర ఆధ్యాపకులు ఈ శిబిరంలో కీలక ప్రాత వహిస్తున్నారు. మొదటి రోజు, ఈ2, ఈ3 నుండి 200 మందికి పైగా విద్యార్థులు బూట్ శిక్షణా శిబిరంలో పాల్గొన్నారు.

జీఎస్టీ రేట్ల తగ్గింపు అతిపెద్ద సంస్కరణ

● బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే రామారావ్ పాటిల్



మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

భైంసా, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ రేట్లను తగ్గించడం స్వతంత్ర భారతవని చరిత్రలో అతిపెద్ద సంస్కరణగా బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి,ముథోల్ ఎమ్మెల్యే రామరావ్ పాటిల్‌లు అభివర్ణించారు. శుక్రవారం భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో జీఎస్టీ రేట్ల తగ్గింపు నిర్ణయాన్ని పురస్కరించుకొని బీజేపీ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్ర పటానికి నిర్వహించిన పాలాభిషేకం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రధాని మోదీ దీపావళి కానుకగా జీఎస్టీ రేట్ల తగ్గింపును చేపట్టడం పట్ల ప్రజలంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. జీఎస్టీ రేట్ల తగ్గింపుతో పేద,మధ్య తరగతి ప్రజానీకానికి ఎంతో ఉపశమనం కలిగిందన్నారు. అన్ని వర్గాలకు ఊరట నిచ్చే అంశమని తెలిపారు. జీఎస్టీ రేట్ల తగ్గింపు సంస్కరణలు ఉత్పాదక రంగంలో డిమాండ్‌ను భారీగా పెంచుతాయని, తద్వార ఉత్పత్తి రంగం గణనీయంగా పురోగతిని సాధించనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఉద్యోగ,ఉపాధి అవకాశాల్లో పెంపుదల చోటు చేసుకోనుందని వివరించారు. ఫలితంగా వృద్ధి రేటు పరుగులు పెట్టనుందని పేర్కొన్నారు. జీఎస్టీ రేట్ల తగ్గింపుతో ఎరువులు, పునరుత్పాదక విద్యుత్, ఆటోమోటివ్, హస్తకళలు, వ్యవసాయం, విద్యవైద్యం రంగాలకు ప్రయోజనం చేకూరనుందన్నారు.

యూరియా కోసం రైతుల తిప్పలు



యూరియా కోసం వచ్చిన రైతులు

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ పనులు ఊపందుకోవడంతో యూరియా అవసరం పెరిగింది. దీంతో మండలంలోని పీఏసీఎస్ సొసైటీ కొట్ట(కే) గ్రామానికి శుక్రవారం యూరియా 450 బస్తాలతో లారీ రావడంతో రైతులు సొసైటీ వద్ద బారులు తీరారు. రైతులకు పరిమితంగానే (ఒక్క రైతుకు 4 బస్తాల) యూరియా ఇవ్వడంతో అధికారులపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొద్ది మంది రైతులకు యూరియా లభించడంతో మిగతా రైతులు నిరాశతో వెనుదిరిగారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన డీసీసీ అధ్యక్షుడు

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : బోరిగాం మాజీ సర్పంచ్ భీమన్న సతీమణి హైదరాబాద్‌లోని కామినేని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు శుక్రవారం భీమన్న సతీమణి చికిత్స పొందుతున్న ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. డాక్టర్లతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. తొందరగా కోలుకోవాలని ఈ సందరంగా ఆయన ఆకాంక్షించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచండి

● రాజురా క్లస్టర్ సమావేశంలో ఎంపీడీవో రత్నాకర్ రావు



ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో రత్నాకర్ రావు

ఖానాపూర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఖానాపూర్ ఎంపీడీవో చిక్యాల రత్నాకర్ రావు అన్నారు. శుక్రవారం రాజురా గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో రాజురా క్లస్టర్ పరిధిలోని రాజురా, చందు నాయక్ తండా, దాసు నాయక్ తండా, సింగపూర్, బావాపూర్(ఆర్) గ్రామాల ఇందిరమ్మ కమిటీ సభ్యులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, సంబంధిత ఇళ్ల నిర్మాణం చేస్తున్న మేస్త్రీలు, పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇళ్ల నిర్మాణ పనుల్లో జాప్యం చేయొద్దని, వేగంగా పూర్తి చేయాలన్నారు. అనంతరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఫరీద్, అశోక్, లావణ్య, గంగవ్వ, లక్ష్మణ్, నాయకులు చిన్నం రవీందర్, నిమ్యా నాయక్, సుజాత, నారాయణ రెడ్డి, నర్సారెడ్డి, రాజేందర్, శంకర్, బాలయ్య, హైదర్, శ్రీహరి, లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శులు రాణి, లావణ్య, పవన్, దేవేందర్ రెడ్డి ఉన్నారు.